ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి: అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య 24వ వార్షికోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న ప్రముఖుల నుంచి ప్రతిభా పురస్కారాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమాఖ్య జాతీయ అధ్యక్షుడు డాక్టర్ గణగళ్ల విజయకుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్య, వైద్యం, సామాజిక సేవలు, పర్యావరణం, ఉపాధి కల్పన తదితర రంగాల్లో అందిస్తున్న సేవలతో పాటు ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులను అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 9391379903 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల వేడుకలు ప్రారంభం

అంబర్‌పేట: ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించి వందేళ్లు కావడంతో నేడు వందేళ్ల ఉత్సవాలను నిర్వహించనున్నట్లు వీహెచ్‌పీ శాఖ విద్యానగర్ జోన్ ఉపాధ్యక్షుడు రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. విజయదశమి నుంచి వచ్చే విజయదశమి ఏడాది పాటు వివిధ కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. బాగ్‌అంబర్‌పేట రెడ్‌బిల్డింగ్ చౌరస్తా నుంచి భరత్‌నగర్ మీదుగా వినాయక్‌నగర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు.

కొత్త పైపులైన్లు వేయాలి



వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్

ముషీరాబాద్: ముషీరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో తాగునీరు కలుషితమవుతోందని వెంటనే నూతన పైపులైన్లు వేయాలని కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ శనివారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముషీరాబాద్‌లోని బాపూజీనగర్, కళాధర్ నగర్, పార్శిగుట్ట, వైఎస్‌ఆర్ పార్కు వీధి, జెమినీ కాలనీలలో నిత్యం కలుషిత నీటి సరఫరా అవుతుందన్నారు. సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు చేస్తే నూతన లైన్లు వేసేందుకు ఆస్కారం ఉంటుందన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

ముషీరాబాద్: శాంతిభద్రతల పరిరక్షణకు రాజకీయ నాయకులు, కార్యకర్తలు, ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని నల్లకుంట ఇన్‌స్పెక్టర్ మారుతిప్రసాద్ కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయనను అడిక్‌మెట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్ ఆధ్వర్యంలో శనివారం కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభమయ్యే నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శేషసాయి, కౌండిన్య ప్రసాద్, కిషోర్, జగదీష్, సంఘం బాలరాజ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



మందులు అందజేస్తున్న వైద్యులు

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్‌లోని ఇందిరానగర్ సెట్విన్ భవనంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జనహిత సేవా ట్రస్ట్, కిమ్స్ ఫౌండేషన్, రెయిన్ బో హోమ్స్ కమ్యూనిటీ కేర్, సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్, గౌస్ ఓ ఖాజ రాజా వెల్ఫేర్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మనోజ్‌రెడ్డి, ఎస్‌ఆర్‌డీ సంస్థ సిబ్బంది ఇందిరాభారతి, శివరాణి, వెంకటేశ్వరి, అస్మా జబీన్, బీవీఎం సభ్యులు చాంద్, షకీల్, హాజీ, గౌస్ ఓ ఖాజ రాజా అధ్యక్షుడు అజారుద్దీన్, మక్సూద్, ఇబ్రహీం, నయీం రెజా పాల్గొన్నారు.

అన్నదానం



ముషీరాబాద్: విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని ముషీరాబాద్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు శ్రీధర్‌చారి ఆధ్వర్యంలో శనివారం ముషీరాబాద్ గౌరీశంకర ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ స్వామిజీకి ప్రత్యేక పూజలు చేసి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం శ్రీధర్‌చారి మాట్లాడుతూ.. పేదలను ఆదుకునేందుకు సామాజిక బాధ్యతతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వీరేశ్, నర్సింగ్‌రావు, శంకర్‌ముదిరాజ్, రామకృష్ణ, నర్సింగ్‌రావు, కృపానంద్ పాల్గొన్నారు.

బతుకమ్మ సందడి షురూ!

ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లోని పలు పాఠశాలలతో పాటు, వివిధ ప్రాంతాల్లో బతుకమ్మ వేడుకలను వైభవంగా ప్రారంభించారు. విద్యార్థులు సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా పట్టు వస్త్రాలను ధరించి బతుకమ్మలను పేర్చి ఆటాపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..పండుగల నిర్వహించటం భవిష్యత్ తరాలకు మన సంప్రదాయాలను పరిచయం చేయటం వంటిదన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

– ముషీరాబాద్, అంబర్‌పేట జోన్ల బృందం





బతుకమ్మతో విద్యామండలి డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి



విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్



కాచిగూడ లోని బద్రుక కళాశాలలో

చెట్టు కొమ్మలు మీదపడి వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడిన రామకృష్ణ

ముషీరాబాద్: విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగులుతున్నాయనే ఫిర్యాదుతో భోలక్‌పూర్ డివిజన్ ఎస్‌బీఐ కాలనీలో శనివారం చెట్ల కొమ్మలు తొలగిస్తుండగా పీఅండ్‌టీ కాలనీకి చెందిన డి.రామకృష్ణ(65) అటుగా వెళ్తుండగా భారీ చెట్టుకొమ్మ అతడిపై పడడంతో రెండు కాళ్లు విరిగిపోయాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకుడు ముఠా జైసింహ ఆసుపత్రికి వెళ్లి రామకృష్ణకు ధైర్యం చెప్పారు. అధికారులు చెట్ల కొమ్మలు తొలగించే సమయంలో ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకపోవడంతోనే రామకృష్ణ రెండు కాళ్లు కోల్పోయాడని ఆరోపించారు. చెట్ల కొమ్మలు కొట్టే సమయంలో ప్రమాద సూచిక బోర్డులు, సిబ్బంది ఉండాలి ఎలాంటి సూచికలు లేకపోవడంతోనే రామకృష్ణ ప్రమాదానికి గురయ్యాడని జైసింహ ఆగ్రహం వ్యక్తం చేశారు.



బాధితుడిని పరామర్శించిన ముఠా జైసింహ

కాంగ్రెస్ హామీలు అమలు చేయాలి



కార్పొరేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న వీహెచ్‌పీఎస్ నాయకులు

అంబర్‌పేట: దివ్యాంగుల సంక్షేమ కోసం కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చేర్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని బాగ్ అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. దివ్యాంగుల హక్కుల కోసం వీహెచ్‌పీఎస్ (వికాలంగుల హక్కుల పోరాట సమితి) చేసే పోరాటానికి మద్దతూ ఇవ్వాలంటూ శనివారం పలువురు వీహెచ్‌పీఎస్ నాయకులు కార్పొరేటర్‌కు వినతిపత్రం అందించారు. ఎమ్మార్పీఎస్ దివ్యాంగుల కోసం చేసే పోరాటానికి మద్దతూ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, ఎడవెల్లి యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

కవాడిగూడ: వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ అన్నారు. శనివారం వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో కవాడిగూడలో కార్పొరేటర్ రచనశ్రీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికి 20 నెలలు గడుస్తున్నా వికలాంగులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో గజ్జెల రాజశేఖర్, రమేష్, చంద్రయ్య, సోమయ్య, మధు పాల్గొన్నారు.



కార్పొరేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

క్రీడలు, సాంస్కృతిక రంగాల్లోనూ రాణించాలి



బహుమతులను అందజేస్తున్న వినయ్‌కుమార్

చిక్కడపల్లి: సేవా పక్వాడలో భాగంగా శనివారం గాంధీనగర్ డివిజన్‌లోని అభ్యుదయ హైస్కూల్లో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు ఆసక్తి ఉన్న క్రీడలు, సాంస్కృతిక రంగాలలో రాణించాలని సూచించారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శైలజారామ్, టీచర్లు నాగలక్ష్మి, రచన, నేతలు నవీన్‌కుమార్, శ్రీకాంత్, సంయుక్త రాణి, పూర్ణ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నల్లకుంట: తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్, నల్లకుంటలోని రంజిత్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్(ఆర్‌ఎస్‌టీ) సంయుక్తాధ్వర్యంలో నిర్వహిస్తున్న జనరల్ డ్యూటీ అసిస్టెంట్(జీడీఏ) కోర్సుల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై 18 ఏళ్ల వయసు దాటిన క్రిస్టియన్ మైనార్టీ నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని డైరెక్టర్ రంజిత్ కౌర్ నేడొక ఓ ప్రకటనలో తెలిపారు. బయోడేటాతో పాటు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం ఫొటో జత చేయాలన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 30లోగా నల్లకుంట శివం సిండికేట్ బ్యాంక్ చౌరస్తా సమీపంలోని శ్రీ రాఘవేంద్ర టిఫిన్ సెంటర్ పైఅంతస్తులో ఆర్‌ఎస్‌టీ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని మరిన్ని వివరాలకు 92463 76667, 91000 06993 నంబర్లలో సంప్రదించాలన్నారు.

22 నుంచి నాడాహబ్బ నవరాత్రి వేడుకలు

కాచిగూడ: కర్ణాటక సాహిత్య మందిర్ ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీ నుంచి నాడాహబ్బ వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి నరసింహ మూర్తి జోయిస్ తెలిపారు. శనివారం కాచిగూడలోని కర్ణాటక సాహిత్య మందిర్‌లో ఆయన మాట్లాడుతూ.. ఈ వేడుకలను సీఎం కార్యాలయ ముఖ్య కార్యదర్శి శేషాద్రి ఐఏఎస్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభిస్తారన్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్‌తో పాటు మంత్రులు, ప్రజాప్రతినిధులు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రానికి చెందిన అధికారులు పాల్గొంటారన్నారు.

చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా ఏడుకొండలు



చిక్కడపల్లి: చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా ఏడు కొండలు పదవీ బాధ్యతలు చేపట్టారు. బేగంబజార్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్(డీఐ)గా ఉన్న ఏడుకొండలు చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ కాగా ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా కొనసాగిన వీరేశం బేగంబజార్ డీఐగా బదిలీ అయ్యారు.

పరామర్శ



చిక్కడపల్లి: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన బీజేపీ సీనియర్ నేత ఆకుల సురేందర్ కుటుంబ సభ్యులను శనివారం కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ వేర్వేరుగా పరామర్శించారు. అనంతరం సురేందర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

రైలుకింద పడి వ్యక్తి మృతి

కాచిగూడ: రైలుకింద పడి ఓ మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. గద్వాల్ జిల్లా, రాజోలు ప్రాంతానికి చెందిన కుర్వ మల్లయ్య (50) రైతు. ఉందానగర్‌లో ఉండే కూతురుని చూడడానికి కర్ణాటక సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌లో వస్తుండగా ఉందానగర్ రైల్వే స్టేషన్‌లో రైలు స్లో కావడంతో దిగుతుండగా జారి రైలుకింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు.

మెరుగుపర్చేందుకు ఇచ్చిన బంగారం తాకట్టు

దుకాణాదారుడి రిమాండ్

చిక్కడపల్లి: బంగారాన్ని మెరుగుపర్చేందుకు ఇవ్వగా దాన్ని తిరిగి ఇచ్చే విషయంలో ఇబ్బందులకు గురిచేయడంతో బాధితుల ఫిర్యాదు మేరకు దుకాణ యజమానికి రిమాండ్‌కు తరలించారు. చిక్కడపల్లి డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శంకర్ మాలోతు వివరాల ప్రకారం.. చిక్కడపల్లికి చెందిన చంద్రరేఖ తన కుమార్తెతో కలిసి చిక్కడపల్లిలోని చంద్రకాంత్ జువెలర్స్‌కు జూలై 23న వెళ్లి 422 గ్రాముల బంగారు ఆభరణాలు(లాంగ్‌చైన్, రెండు చైన్లు, చెవి రింగులు, లాకెట్, వడ్డాణం) మెరుగు పర్చేందుకు ఇచ్చారు. 26న వడ్డాణం మినహా మిగతా ఆభరణాలు ఇచ్చాడు. కొన్ని రోజుల తర్వాత వెళ్లి వడ్డాణం ఇవ్వాలని కోరగా పని పూర్తి కాలేదని చెప్పుకొస్తూ బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు చంద్రకాంత్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టినట్లు నిర్ధారణ కావడంతో చంద్రకాంత్‌ను రిమాండ్‌కు తరలించారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే



కాచిగూడ: బర్కత్‌పురలోని అవంతి కళాశాలలో శనివారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే ఉత్సాహంగా సాగింది. సీనియర్ విద్యార్థులు జూనియర్స్‌లో ఉండే భయాన్ని పోగొట్టేలా అందరు కలిసి డ్యాన్సులు చేస్తూ సందడి చేశారు. డ్యాన్సులు విభిన్న రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకృష్ణారెడ్డి, అవంతి విద్యాసంస్థల చైర్మన్ యం.శ్రీనివాస్ రావు, గరిమెళ్ల శ్రీనివాస్, జి.నిర్మల్ కుమార్, బర్కత్‌పుర కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాకేష్ పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం



పోషక ఆహార మాసోత్సవంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట: చిన్నారుల్లో పోషక ఆహార లోపాన్ని నివారించేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. శనివారం గోల్నాక గంగానగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై చిన్నారులకు అందిస్తున్న పోషక ఆహార వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిల్లేట్లు, గుడ్లు వంటి భిన్నమైన ఆహారాన్ని చిన్నారులకు అందిస్తే ఆరోగ్య సమతూల్యత సాధ్యమవుతుందన్నారు. ఈ నెల రోజుల పాటు ప్రత్యేక పోషక ఆహారాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీడీఓ పావని, సుపర్‌వైజర్ స్వేత పాల్గొన్నారు.

- అంబర్‌పేట డివిజన్ మున్సిపల్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న ఆస్పత్రి పనులను కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు.

సమస్యల పరిష్కారానికి వినతి..

నల్లకుంట: విజ్ఞానపురి హౌజింగ్ బోర్డు కాలనీవాసులు హౌజింగ్ బోర్డు నుంచి దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కాలనీ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ సభ్యులు శనివారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే హౌజింగ్ బోర్డు అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటానన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో విఠల్ రెడ్డి, నారాయణ రెడ్డి, క్రిష్ణ స్వామి. బి.రఘురాం రెడ్డి, ఉన్నారు.

ధర్మపురిలో గోశాల ఏర్పాటుకు స్థలం కేటాయిస్తాం



మంత్రిని సత్కరిస్తున్న మహేష్ అగర్వాల్

కాచిగూడ: ధర్మపురిలోని ప్రసిద్ధ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం పరిధిలో గోశాల ఏర్పాటుకు స్థలం కేటాయించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం శనివారం మంత్రిని కలిసి జ్ఞాపిక అందజేశారు. దసరా పండుగ తర్వాత స్థల పరిశీలన చేపడతామని, స్థల పరిశీలన సమయంలో గోశాల ఫెడరేషన్ ప్రతినిధి బృందాన్ని ఆహ్వానిస్తామని మంత్రి హామీ ఇచ్చారని మహేష్ అగర్వాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్‌చంద్ మునోత్, దీపక్ దయాల్ దాదు పాల్గొన్నారు.

కార్మికులు సమస్యలపై ఉద్యమించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలోని రవాణా కార్మికులు తమ సమస్యలపై ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వీరయ్య పిలుపునిచ్చారు. శనివారం తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేట్ రోడ్ ట్రాన్స్‌పోర్టు ఫెడరేషన్ 4వ మహాసభలను పురస్కరించుకొని సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మిక వర్గం మెడకు ఉరితాడు బిగించారని విమర్శించారు. రవాణా కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అజయ్‌బాబు, శ్రీకాంత్, కుమారస్వామి, శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

ఆ సంస్థలపై చర్యలు తీసుకోవాలి



దండి వెంకట్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రైవేట్ విద్యా, వైద్య సంస్థలపై చర్యలు తీసుకోవాలని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్ చేశారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు, ఆరోగ్య బకాయిల కోసం వైద్య సంస్థలు తమ బకాయిలు చెల్లించాలని లేకుంటే బంద్ ప్రకటిస్తామని విద్యార్థులు, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ మరోవైపు రాష్ట్ర ప్రభుత్వాన్ని బెదిరించడాన్ని చూస్తే ప్రైవేట్ కార్పొరేట్ మాఫియా ప్రభుత్వానే బెదిరించే స్థాయికి చేరిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలు తమ ఆదాయంలో సగానికిపైగా పిల్లల కోసం ఆరోగ్యం కోసం ఖర్చు చేస్తూ తమ జీవితాలను వెల్లదీసుకుంటున్నారని అలాంటి పేద ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



చెత్త ఊడ్చుతున్న కార్పొరేటర్ అమృత

నల్లకుంట: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని నల్లకుంట కార్పొరేటర్ అమృత అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మ దినాన్ని పురస్కరించుకొని శనివారం పాత నల్లకుంట దుర్గామాత ఆలయం వీధిలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. పారిశుధ్య సిబ్బంది, బీజేపీ నాయకులతో కలిసి వీధులు శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్‌కుమార్ జోషి, మధుయాదవ్, భాస్కర్ యాదవ్, రవి పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త లేకుండా చూడండి

కాచిగూడ: రోడ్లపై చెత్త లేకుండా చూడాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ సూచించారు. శనివారం డివిజన్ పరిధిలోని కాచిగూడ స్టేషన్ రోడ్డు, వీరన్నగుట్ట తదితర ప్రాంతాల్లో ఆమె జీహెచ్‌ఎంసీ సిబ్బందితో కలిసి పర్యటించి స్థానికులతో మాట్లాడారు. రోడ్లపై ఇష్టానుసారంగా చెత్త వేయరాదని ఇళ్ల వద్దకు వచ్చే కార్మికులకు ఇవ్వాలన్నారు. కార్పొరేటర్ వెంట దర్శన్, ఉమక్క, స్రవంతి, బి.భీమ్‌రాజ్, విష్ణు, లక్ష్మణ్ ఉన్నారు.



చెత్తను తొలగించాలని సూచిస్తున్న కార్పొరేటర్

ఆన్‌లైన్ నోటరీ విధానం వద్దు



మాట్లాడుతున్న గంజి యాదగిరి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆన్‌లైన్ నోటరీ విధానాన్ని తీసుకు రావొద్దని తెలంగాణ అడ్వొకేట్ నోటరీస్ అసోసియేషన్ (తానా) అధ్యక్షులు మాజీ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ గంజి యాదగిరి డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ కార్యాలయం నుంచి మెమోను నెంబర్ NQ/CAQD/8851/2023ని ఈ నెల 9వ తేదీన జారీ చేసిందన్నారు. దీని ప్రకారం నవంబర్ 1వ తేదీ నుంచి నోటరీలను ఆన్‌లైన్ చేయాలని ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. నోటరీస్ ఆన్‌లైన్ సాధ్యం కాదన్నారు. నోటరీస్ చేసే అడ్వొకేట్స్ ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని ఆన్‌లైన్ చేయడానికి కంప్యూటర్ ఇతర పరికరాలు ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి ఉందన్నారు. ఇప్పుడున్న విధానాన్నే కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోశి దేవందర్ బాబు, నరిసింహా, నరిసింగ్‌రావు, నరిసింహా, వేణుమాదవ్, పాశం అనిల్ కుమార్ యాదవ్, సతీష్, ఎంఎం బేగ్ ఉన్నారు.